క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'హత్తిని'



విజేతకు బహుమతి అందజేస్తున్న విద్యాసాగర్

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతగా నిలిచిన హత్తిని జట్టుకు పాలె సుధాకర్ రూ. 20వేలు, రన్నరప్ కొత్తగూడ జట్టుకు చప్పిడే రవి రూ.10వేలతో పాటు బహుమతులు అందజేశారు. మ్యాచ్ అనంతరం క్రీడాకారులకు మాజీ సర్పంచ్ ఉపాసి సంజీవ్, బిబ్రా గ్రామానికి చెందిన జమ్మూ ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేశ్, శ్రీకాంత్, రాజు, కార్తీక్, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. హెచ్‌ఎం నటరాజ్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల భూదాత జైరాం ఉప్రే, గ్రామపెద్ద గాదె అవినాశ్, తారాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



నారాయణ (ఫైల్)

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ జన్నె నారాయణ(55) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నారాయణకు ఆదివారం రాత్రి చాతిలో నొప్పి వస్తుందని పడుకున్నాడు. చుట్టుపక్కల వారిని పిలిచి ఆసుపత్రికి తరలించే క్రమంలో అప్పటికే మృతి చెందారని పేర్కొన్నారు. 2009-14 వరకు ఉమ్మడి గిరవెల్లి పంచాయతీకి సర్పంచ్‌గా సేవలందించారు.

'ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించండి'

కెరమెరి: ఎల్‌ఆర్‌ఎస్ నిధిని ఈనెల 31 వరకు చెల్లించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో హట్టి గ్రామంలో ఇంటి స్థలం, ప్లాట్లు కొనుగోలు చేసి లేఅవుట్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ఈ నెల 31 వరకు రాయితీ కల్పిస్తుందన్నారు. లబ్ధిదారులు చెల్లింపులు చేసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ ఉన్నారు.

'కేసీఆర్‌కు కృతజ్ఞతలు'



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ముద్దుబిడ్డ దాసోజు శ్రవణ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆసిఫాబాద్ స్వర్ణకార సంఘం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు నల్గొండ శ్రీరాములుచారి, వరప్రసాద్‌లు మాట్లాడారు. సభ్యులు పెంటయ్యాచారి, మహేశ్‌చారి, తిరుపతిచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడి పర్యటన

ఆసిఫాబాద్‌అర్బన్: వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ మంగళవారం మండలంలోని ఏపల్వాడులో పర్యటించనున్నట్లు ఆసిఫాబాద్ వాసవిక్లబ్ అధ్యక్షుడు పాత శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపల్వాడు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని, కార్యక్రమానికి క్లబ్ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఏకైక చేతిపంపు

- నాలుగురోజులుగా అందని మిషన్ భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న ఆదివాసీలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు

జోడేఘాట్‌లో దప్పిక తిప్పలు

కెరమెరి: వేసవి కాలం వచ్చేసింది.. ఎండలు ఇంకా ముదరను కూడా లేవు.. కానీ అప్పుడే భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మండలంలోని జోడేఘాట్‌లో ప్రజల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ గడిచిన నాలుగు రోజులుగా పని చేయడం లేదు. దీంతో ఆదివాసీలకు దప్పిక తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం తాగునీటితో పాటు ఇతర అవసరాలకు గ్రామానికి దూరంగా ఉన్న చేతిపంపుపైనే ఆధారపడుతున్నారు.

గ్రామానికి దూరంగా..

జోడేఘాట్‌లో 50 కుటుంబాలు, సుమారు 200 జనాభా ఉంది. కానీ గ్రామంలో ఒక్క చేతిపంపు కూడా లేదు. దీంతో నీటి కోసం గ్రామానికి అరకిలోమీటరు దూరంలో ఉన్న చేతిపంపు వద్దకు పరుగులు తీస్తున్నారు. అడుగుంటుతున్న భూగర్భ జలాల నేపథ్యంలో చేతిపంపు నుంచి అతి తక్కువగా నీరు వస్తోంది. అన్ని అవసరాలకు చేతిపంపు నీటినే వినియోగిస్తున్నారు. మ్యూజియం కోసం ఏర్పాటు చేసిన బోరు ఉన్నప్పటికీ కేవలం గంట పాటు మాత్రమే నీరు వస్తుంది.

అందని మిషన్ భగీరథ నీరు..

మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజల దాహార్తి తీర్చేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్



మ్యూజియం కోసం వేసిన బోరు

భగీరథ పథకం నిరుపయోగంగా మారింది. గడిచిన నాలుగు రోజులుగా నీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో నాలుగు రోజుల క్రితం వచ్చిన నీటిని నిల్వ చేసుకుని వాడుకుంటున్నామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామంలో కొనసాగుతున్న పీఎం జన్‌మన్ పాఠశాల భవన కాంట్రాక్టర్ గ్రామానికి సమీపంతో పాటు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 200 నుంచి 300 ఫీట్ల వరకు రెండు బోర్లు వేసినప్పటికీ నీరు రాలేదని పేర్కొంటున్నారు.

పెద్ద వాగే దిక్కు..

ప్రస్తుతం కొద్దోగొప్పో పని చేస్తున్న చేతిపంపు చెడిపోతే.. జోడేఘాట్‌కు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద వాగు వద్దకు పరుగెత్తాల్సిన పరిస్థితి ఉంటుంది. గుట్టదిగి లోయలో ఉన్న పెద్దవాగుకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఐటీడీఏ అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటికీ శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. మిషన్ భగీరథపై ఆధారపడినప్పుడు ఒకటి, రెండు రోజులు నీరు రాకుంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని, పెద్ద వాగు నుంచి పైప్‌లైన్ వేస్తే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎత్తిపోతల ద్వారా నీటిని సరఫరా చేస్తే తప్పా జోడేఘాట్ వాసులకు శాశ్వత పరిష్కారం లభించదని పేర్కొంటున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



మిషన్ భగీరథ నీరు రాని రోజు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామానికి దూరంలో ఉన్న చేతిపంపు వద్దకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పుడు ఎలాగో బోరింగు నీరు పట్టుకుంటున్నాం. మరికొద్ది రోజులైతే భూగర్భ జలం అడుగంటిపోయి చుక్క నీరు రాని పరిస్థితి ఉంటుంది. అధికారులు స్పందించాలి. – కే. పద్మ, జోడేఘాట్

శాశ్వత పరిష్కారం చూపాలి



గడిచిన నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో తాగు నీరు, ఇతర సౌకర్యాల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఎంతో కష్టమవుతుంది. అందుకు 1.5 కిలో మీటరు దూరంలో ఉన్న పెద్ద వాగునుంచి పైప్‌లైన్ వేసి నీరు సరఫరా చేయాలి.

– పీ. రాజేశ్వర్, జోడేఘాట్

ఇబ్బంది లేకుండా చూస్తాం..



విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల నీటి సరఫరాలో కొంత ఇబ్బంది అవుతుంది. ఆదివారం కూడా మిషన్ భగీరథ నీరు సరఫరా చేశాం. ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉంటే సరిచేస్తాం. నేటి నుంచి ప్రజలు ఇబ్బందిపడకుండా మిషన్ భగీరథ నీటిని అందిస్తాం.

– విశ్వేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

చినరాస్పెల్లి పాఠశాలలో మాతృవందనం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మాతృవందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సుశీల జ్యోతి ప్రజ్వలన, సరస్వతి పూజ చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. సునీత మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నందున వారి గొప్పతనంపై విద్యార్థులకు వివరించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమైనది



సన్మానిస్తున్న కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి

రెబ్బెన: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్, సింగరేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు వేణుగోపాల్ పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వేణుగోపాల్ దంపతులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా సంస్థకు, విద్యార్థులకు ఎన్నో సేవలు అందించారన్నారు. విద్యాబోధనతో పాటు తన పిల్లలను ఉన్నత చదువులు చదివించి గొప్ప స్థానంలో నిలబడేలా ప్రోత్సహించారని ప్రశంసించారు. సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయులు ఆర్లారెడ్డి, బాబునాయక్ పాల్గొన్నారు.

'యూనివర్సిటీ పేరు మార్చొద్దు'



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కాంగ్రెస్ ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును మార్చి సురవరం సుధాకర్‌రెడ్డి పేరు పెట్టడం సరికాదని ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి వొజ్జల వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక వాసవిమాత ఆలయ ప్రాంగణంలో వారు మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేసిన పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి పేరును ఇతర ప్రాజెక్టుకు పెట్టుకోవాలని సూచించారు. యూనివర్సిటీ పేరును తొలగిస్తే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం మండలాధ్యక్షులు ఎల్క సిద్దేశ్వర్, సభ్యులు ప్రశాంత్, అనిల్, మనీష్, వెంకన్న, సాయి, శేఖర్ పాల్గొన్నారు.

బీసీ లైసన్ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న బీసీ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా బీసీ వెల్ఫేర్ లైసెన్ అధికారిగా డీవైఎస్ మధుకుమార్ ఎన్నికైన సందర్భంగా సోమవారం గోలేటి సీహెచ్‌పీ బీసీ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మధుకుమార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏరియా కమిటీని పరిచయం చేసుకుని బీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం చేపట్టాల్సిన చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. అసోషియేషన్ అధ్యక్షుడు గోలెం గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మేరుగు రమేశ్, కోశాధికారి విద్యాసాగర్, అలివేణి సంపత్, మాంత్ సమ్మయ్య, ఎంబడి రామయ్య, మర్రి సమ్మయ్య, కొవ్వూరి శ్రీకాంత్, రమేశ్, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



టీచర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో సుభాశ్

హిందీ ఉపాధ్యాయుడికి..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు సుధాకర్ ఇటీవల హిందీ లెక్చరర్‌గా ఎంపికైన సందర్భంగా సోమవారం ఎంఈవో సుభాశ్ సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రమేశ్, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లక్షణాలు గల ఉపాధ్యాయులు కావాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న రవీందర్ రెడ్డి

ఆసిఫాబాద్‌రూరల్: ఉత్తమ లక్షణాలు గల ఉపాధ్యాయులు తయారు కావాలని ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీనిధి డైట్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రతిరోజు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. సరిగ్గా రికార్డు, టీచింగ్ ప్రాక్టీస్ చేయాలని అన్ని సబ్జెక్టుల మీద అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్, ఛాత్రో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్య తెలుసుకుని.. పరిష్కారం చూపి



చేతిపంపు ప్రారంభిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

రెబ్బెన: పోలీసులు అంటే శాంతిభద్రతల పరిరక్షణలోనే కాదు ప్రజా సేవలోనూ ముందుండి పనిచేస్తారని రెబ్బెన పోలీసులు నిరూపించారు. మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామం సోనాపూర్ గ్రామసందర్శన సమయంలో గ్రామస్తులు గ్రామంలో చేతిపంపు పనిచేయడం లేదని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సమస్య పరిష్కారం అత్యవసరమని గుర్తించిన పోలీసులు వెంటనే మెకానిక్‌ను పిలిపించి మరమ్మతులు చేయించి ప్రజా సమస్యలపై పోలీసులకు ఉన్న చిత్తశుద్ధి చాటుకున్నారు. సమస్య విని వదిలేయకుండా సత్వరమే పరిష్కార మార్గం చూపిన పోలీసుల కృషికి గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా చేతిపంపును సోమవారం సాయంత్రం ఏఎస్పీ చిత్తరంజన్ ప్రారంభించారు. సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. వేంపల్లి నుంచి కాగజ్‌నగర్ వస్తున్న బొలేరో వాహనం డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి తోపుడు బండిలో గాజుల వ్యాపారం నిర్వహిస్తున్న మహబూబ్‌ఖాన్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో మహబూబ్‌ఖాన్ (55) అక్కడికక్కడే మృతి చెందగా, సిర్పూర్ (టి) మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన నందిపేట తరుణ్, బూరం కార్తీక్, దుర్గం చరణ్, ఈశ్వర్‌లకు గాయాలయ్యాయి. తరుణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పాకాజీనగర్‌కు చెందిన బొలేరో వాహన డ్రైవర్ షాబాజ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, వాహనాన్ని సీజ్ చేశామని రూరల్ ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

పచ్చదనానికి సన్నద్ధం!

- గ్రామ పంచాయతీ నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు
- ఈ ఏడాది 3.05 లక్షలు నాటడమే లక్ష్యం

తిర్యాణి: రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం పేరిట మొక్కలను పెంచే కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రతీ ఏడాది వర్షాకాలంలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుంది. ఇందుకోసం మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకంగా ఒక్కో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. వీటి నిర్వహణ బాధ్యతను సంబంధిత గ్రామపంచాయతీలకే ప్రభుత్వం అప్పగించింది. దీంతో పాటుగా ప్రత్యేకంగా మొక్కల సంరక్షణ కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వనసేవక్‌ను నియమించి సంరక్షణ బాధ్యతలు చేపడుతున్నారు.

లక్ష్యం 3.05 లక్షలు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కోసం ముందస్తుగా మండలంలో ఏర్పాటు చేసిన 29 నర్సరీల్లో 3.05 లక్షల మొక్కలు పెంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. కాగా ఈ మొక్కలు ఎక్కువగా ఇంట్లో పెంచుకునేందుకు అనుకూలంగా ఉండే మామిడి, జామ, నిమ్మ, గులాబి, నేరేడు, సీతాఫలం, ఉసిరి, దానిమ్మ, బాదాం, మందార, మల్లె వంటి పండ్లు, పూల మొక్కలతో పాటుగా టేకు, గంధం, వెదురు, కానుగ, వేప, రావి వంటి నీడనిచ్చే మొక్కలను సైతం నర్సరీల్లో పెంచుతున్నారు. కార్యక్రమంలో భాగంగా గృహ సముదాయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ అంతర్గత రహదారుల పక్కన, పొలం గట్టు, చెరువులు, కుంటలు, పార్కులు, డంపింగ్‌యార్డులు కాల్వ గట్లపై మొక్కలను నాటనున్నారు. అయితే ఇప్పటికే మొక్కల పెంపకం కోసం బ్యాగ్ ఫిల్లింగ్ చేపట్టి అందులో విత్తనాలను సైతం వేశారు. వీటికి ప్రతీరోజు రెండుసార్లు నీటిని పోస్తుండటంతో పాటుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల ద్వారా మొక్కల పెంపకంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రీన్‌మ్యాట్ పైనుంచి కట్టి సంరక్షణ చేపడుతున్నారు.



తిర్యాణిలోని నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో (ఫైల్)

29 నర్సరీల్లో పెంపకం

మండలంలోని 29 నర్సరీల్లో 3.05 లక్షల మొక్కల పెంపకం చేపడుతున్నాం. మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు పెరుగుతున్న గరిష్ట ఉష్ణోగ్రతల నేపథ్యంలో మొక్కలు చనిపోకుండా ఉండేందుకు గ్రీన్‌మ్యాట్‌ను సైతం ఏర్పాటు చేశాం. వర్షాకాలం ప్రారంభంలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నాం.

– షాకిర్ ఉస్మాని, ఏపీవో, తిర్యాణి

పశువుల వాహనం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

సిర్పూర్(టి): కౌటాల మండలం నుంచి జగిత్యాల జిల్లా రాజారంపల్లి గ్రామానికి అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలకేంద్రం నుంచి సిర్పూర్(టి) మీదుగా జగిత్యాల జిల్లాకు ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా అక్రమంగా ఏడు పశువులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి పశువులతో పాటు వాహనాన్ని అదుపులో తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'వన్ నేషన్ వన్ ఎలక్షన్' ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో పాటు క్యాబినెట్‌లో కూడా తీర్మానం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణతో ప్రజాధనం వృధా కాకుండా ఉంటుందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో జమిలీ ఎన్నికలకు స్వస్తి పలికినట్లు తెలిపారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరిగితే తమ మనుగడ పోతుందని కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి మోదీ క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు సేకరించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారన్నారు. ఇందులో భాగంగా నేడు జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, ప్రసాద్‌గౌడ్, న్యాయవాది పంచదార దీపక్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పనిముట్లు

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా జిల్లాలోని రైతులకు వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి రావూరి శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ పరిధిలోని ఏఈవోలకు పట్టా పుస్తకం, ఆధార్ కార్డు అందజేయాలన్నారు. నాగలి, కల్టివేటర్, రోటవేటరు, ట్రాక్టర్ పనిముట్లు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ విడర్, పవర్ టిల్లర్ బ్యాటరీస్ ప్రేయర్ వంటి పరికరాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉదయమే ఉపాధి పనులు చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్

బెజ్జూర్: రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా కూలీలు ఉదయం పూటనే పనులు చేపట్టాలని ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మర్తిడి, రెబ్బెన గ్రామాల్లోని ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పనులు చేపట్టడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కూలీలు ఉదయం వేళల్లో పనులు చేసుకోవాలని సూచించారు.